మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



### గ్రామస్తులకు ఊరట

# బోనులో చిక్కిన చిరుత


బోనులో చిక్కిన చిరుత

**మద్దూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** మద్దూరు మండలం మోమినాపూర్ గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న చిరుత పులి బుధవారం అటవీశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక బోనులో చిక్కింది. పిల్లి గుండు, పెద్ద చెరువు గుట్టల ప్రాంతాల్లో గతకొన్ని రోజులుగా చిరుత సంచారం కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు వెంటనే బోను ఏర్పాటు చేసి చిరుతను పట్టుకున్నారు. పట్టుబడిన చిరుతను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అయితే మరికొన్ని చిరుతలు ఉండే అవకాశం ఉన్నందున గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారి లక్ష్మణ్ నాయక్ సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లవద్దని ఏదైనా జంతువు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

# సర్వే వేగవంతం చేయాలి

- ◆ గురుకులంలో భోజనం నాణ్యత పాటించాలి
- ◆ జడ్చర్ల నియోజకవర్గంలో పర్యటించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్


విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**జడ్చర్ల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** జడ్చర్ల మునిసిపాలిటిలో జరిగే నక్ష సర్వే త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. అన్ని మండలాల తహసిల్దార్లకు ఎస్ఐఆర్ 2025 మ్యాపింగ్, భూభారతి, ముఖ్యమంత్రి/ కలెక్టర్ ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. బాలానగర్ కస్తూర్బా బాలికల విద్యాలయం పరిశీలించిన అదనపు కలెక్టర్ జడ్చెర్ల ట్రైబల్ మినీ గురుకులం పరిశీలించడం జరిగింది. అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల మండలాల తహసిల్దార్ కార్యాలయాలను పరిశీలించి తహసిల్దార్ కార్యాలయాల సిబ్బందితో సమావేశం తీసుకొని ఎస్ఐఆర్ 2025 మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలని బూత్ లెవెల్ ఆఫీసర్‌లతో సమన్వయం చేసుకొని త్వరగా ఎస్ఐఆర్ 2025 మ్యాపింగ్ చేయాలనీ, భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తహసిల్దార్లు సిబ్బందికి ఆదేశించడం జరిగింది. ముఖ్యమంత్రి/ కలెక్టర్ ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ మహబూబ్ నగర్, జడ్చర్ల మునిసిపాలిటిలో జరుగు నక్ష సర్వేను పరిశీలించడం జరిగింది. జడ్చర్ల మునిసిపాలిటిలో జరుగు నక్ష సర్వేలో మొత్తం వార్డులు 20, బ్లాక్స్ 202 వున్నాయి. ఇప్పటివరకు 22 బ్లాక్స్ లో సర్వే కొనసాగుతుందన్నారు. 1. జడ్చర్లలో మొత్తం ప్రాపర్టీస్ 18,679 వున్నాయి 2. ఇప్పటివరకు గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తైన ప్రాపర్టీస్ 2192 డిజిటలైజేషన్ పూర్తైనవి 14263. మిగతా వార్డ్‌లో నక్ష సర్వే కొనసాగుతుందని తెలిపారు. జడ్చర్ల ట్రైబల్ మినీ గురుకులంలో విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. వారి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించి అక్కడ పరిశుభ్రతపాటించాలని, నాణ్యమైన తాజా కూరగాయలను ఉపయోగించాలని సిబ్బందికి సూచించారు.

### సంత్ సేవాలాల్ చూపిన సన్మార్గాలు

# ప్రతి ఒక్కరికి ఆచరణీయం

- • వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలలో ఎమ్మెల్యే, కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గాలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను బుధవారం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నాగవరం గ్రామ శివారులోని సేవాలాల్ బంజారా భవన్‌లో సాంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల ఉన్న తాండాల నుండి గిరిజనులు హాజరుకాగా లంబాడి మహిళలు తమ సాంప్రదాయ దుస్తులతో వేడుకలకు హాజరయ్యారు. ముందుగా సేవాలాల్ మహారాజ్, మేరమ యాడి దేవతకు మహాబోగ్ (హోమం)కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనారెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యానాయక్, లంబాడి పూజారులు రాజ్‌పవార్, బిక్ష్యానాయక్‌తో కలిసి సాంప్రదాయ బద్ధంగా హోమంలో నెయ్యి కడావ్ ప్రసాదం వేసి నైవేద్యం సమర్పించారు. జిల్లాలోని సమస్త ప్రజలు ఆయురారోగ్యాలు, ధన ధాన్యాలతో వర్థిల్లే విధంగా ఆశీర్వదించాలని ప్రార్థించారు. అనంతరం జరిగిన కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ అందరి కీ ఆదర్శప్రాయుడని, జీవ హింసచేయరాదని, అబద్ధం మాట్లాడవద్దు, దొంగతనాలు చేయవద్దు, మాంసాహారం చేయవద్దని బోధించారని గుర్తు చేశారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గాలు ప్రతిఒక్కరికీ ఆచరణీయమని చెప్పారు. శాసన సభ్యులు మేఘారెడ్డి మాట్లాడుతూ సేవాలాల్ 287వ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. వనపర్తి నియోజకవర్గానికి రూ.2.68లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. దౌర్జన్యానికి వ్యతిరేకంగా బ్రిటిష్‌వారితో పోరాటం చేసిన యోధుడని అన్నారు. దొంగతనాలు చేయొద్దు, మాంసాహారం తినొద్దు అనిబోధించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పి.సీతారాంనాయక్, గిరిజన అభివృద్ధి అధికారి అధికారులు, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మిడిదొడ్డి మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, గిరిజన సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన మహిళలు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.



# 20 రోజుల్లో పూర్తి చేయాలి

▶▶ మ్యాపింగ్ వేగవంతం చేయాలి ▶▶ మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం


ఆన్‌లైన్ ఓటర్ సవరణ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:** జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎలెక్టోరల్ రోల్స్ సవరణలో భాగంగా ఓటరు జాబితా మ్యాపింగ్ పనులను వేగవంతం చేసి, వచ్చే 20 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బూత్ స్థాయి అధికారులకు (బిఎల్ఓలు) ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కంప్యూటర్ శిక్షణ మందిరంలో మహబూబ్ నగర్ అర్బన్ మండల బిఆర్ఓలకు నిర్వహించిన ఆన్‌లైన్ ఓటర్ సవరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. మహబూబ్ నగర్ అర్బన్ మండలంలో ఇప్పటివరకు కేవలం 38 శాతం మాత్రమే ఓటరుజాబితా మ్యాపింగ్ పూర్తయిందని గుర్తించి, వచ్చే 20 రోజుల్లో కనీసం 80 శాతం వరకు పురోగతిసాధించాలని సూచించారు. బిఎల్ఓలు, సూపర్వైజర్లు కచ్చితంగా క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రతి ఇంటిని సర్వే నిర్వహించాలని, లేని పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా బిఎల్ఓలతో మాట్లాడుతూ, ఓటరు జాబితా నవీకరణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క బిఎల్ఓ తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, 2025 తాజా ఓటరు జాబితాలోని పేర్లను 2002 ఓటరు జాబితాతో సరిపోల్చి మ్యాపింగ్ చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రోజనీ మ్యాపింగ్‌ను కూడా ఖచ్చితంగా నిర్వహించి నిర్దేశించిన టార్గెట్ ను పూర్తిచేయాలని అన్నారు. ప్రోజనీ మ్యాపింగ్ కొరకు ఇతర అసెంబ్లీ నియోజక వర్గాలలో ఎక్కడైనా 2002 ఓటరు జాబితాలో ఓటరులేదా వారి యొక్క తల్లితండ్రులు, తాత, అమ్మలు ఉన్నచో అక్కడి బిఎల్ ఓలను సంప్రదించి మ్యాపింగ్ చేయించుకోవాలని అన్నారు. సవరణలో భాగంగా ఏవైనా పేర్ల తొలగింపులు లేదా చేర్పులు ఉంటేవాటిని పూర్తి స్థాయి పరిశీలన అనంతరం మాత్రమే నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్ నాయక్, ఇతర అధికారులు బిఎల్ఓ లు పాల్గొన్నారు.

# కనిపించిన నెలవంక.. రంజాన్ నెల ప్రారంభం

- ◆ నెల పాటు ఉపవాస దీక్షలు...
- ◆ ముస్తాబైన మసీదులు



**దేవరకద్ర, ఫిబ్రవరి18 ప్రభాతవార్త:** ముస్లిం సోదరులకు పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమైంది. గురువారం తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు. బుధవారం సాయంత్రం దేశ వ్యాప్తంగా నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు మత పెద్దలు ప్రకటించారు. ప్రత్యేక ప్రార్థన కోసం ఇప్పటికే మసీదులు ముస్తాబ్ అయ్యాయి. రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు, ప్రార్థనలు చేస్తారని, ఇది ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణ ఇస్తుందని పేర్కొన్నారు.

**నెలపాటు ఉపవాస దీక్షలు:** ముస్లింల అత్యంత పవిత్ర మాసం రంజాన్ ను ప్రతి ముస్లిం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. నియమ నిష్టలతో –మిగతా4లో..

# బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

- • గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

**గద్వాల ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** బాల్య వివాహాలు నిర్మూలించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు, సంబంధిత శాఖల అధికారులేకాక ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ పిలుపునిచ్చారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సౌజన్యంతో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జస్ట్ రైట్స్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు బాల్య వివాహ ముక్త్ భారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా రూపొందించిన రథయాత్ర వాహానాన్ని బుధవారం ఐడిఓసి ఆవరణలో జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినప్పటికీ అక్కడక్కడ బాల్య వివాహాలు జరుగుతుండడం బాధాకరమన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని గట్టు, కేటీదొడ్డి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని నిర్మూలించేందుకు ప్రజలందరూ సామాజిక బాధ్యతతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలకు సన్నాహాలు చేస్తుంటే ముందుగానే తెలుసుకొని ఆపివేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.


రథయాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్

అమ్మాయిలకు 18 ఏళ్లలోపే పెళ్లి చేయడం వలన వారి చదువు మధ్యలోనే ఆగిపోతుందని, ఆరోగ్యపరంగానూ ఇబ్బంది పడాల్సి వస్తుంద న్నారు. చిన్న వయసులోనే గర్భం దాల్చడం వలన తల్లితోపాటు శిశువు ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఫలితంగా రెండు, మూడు తరాలు వివిధ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల్లో పాలుపంచుకునే వారందరికీ చట్టపరంగా వివిధ శిక్షలు వేయడం జరుగుతుందని ప్రజలకు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించాలన్నారు. పౌరులందరూ బాల్యవివాహాల నిర్మూలనను సామాజిక బాధ్యతగా భావించి ప్రభుత్వానికి సహకరించాలని పేర్కొన్నారు. 2030వ సంవత్సరం నాటికి దేశంలో బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, బాల్య వివాహముక్త్ భారత్ ఈ రథయాత్ర ముఖ్య ఉద్దేశ మన్నారు. ఈ సందేశం ప్రతి మండలానికి, గ్రామానికి, ప్రతిఒక్క ఇంటికి చేరేలాసంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్‌సూచించారు. అనం తరం బాల్యవివాహాల నిర్మూలనపై ముద్రించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి విడుదల చేశారు. బాల్య వివాహాలు లేని భారతదేశము నినాదంతో రూపొందించిన సిగ్నేచర్ క్యాంపెయిన్ బోర్డుపై కలెక్టర్‌తో పాటుపలువురు అధికారులుతమ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో అద నపు ఎస్పీ శంకర్, డిడబ్ల్యుఓ సునంద, డీఈవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, డీసీపీఓ నరసింహా, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, జస్ట్ రైట్స్ సమన్వ యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే పేదోడి ఇంటి కల సాకారం

- ◆ ఇందిరమ్మ గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**నవాబుపేట, 18 ఫిబ్రవరి ప్రభాతవార్త:** కాంగ్రెస్ హయాంలోనే పేదోడి సొంతింటి కల సహకారం అవుతుంది అని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాంసింగ్ తండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు గృహప్రవేశంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం పేదల గృహావసరాలను తీర్చేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి అర్హుడికి గౌరవప్రదమైన నివాసం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా అనేక కుటుంబాలు సొంత ఇంటి కలను సాకారం చేసుకున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే తండాల అభివృద్ధికి అవసరమైన రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కూడా దశలవారీగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట మండల అధ్యక్షులు నీరటి రామచంద్రయ్య తో పాటు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు కలి బాయ్ గొప్యానాయక్, సర్పంచ్ జ్యోతి అంబదాస్ డిప్యూటీ సర్పంచ్ రాధిక రవీందర్, మండల అధికారులు ఎంపీడీవో జయరాం, హౌసింగ్ అధి కారులు, ఏఎంసి వైస్ చైర్మన్ హరలింగం, మండల కాంగ్రెస్ పార్టీ నాయ కులు వెంకటేష్‌గౌడ్ బంక అంజన్ కుమార్, బంక వెంకటయ్య, ఖాజా, మైనుద్దీన్, మాజీ ఎంపిటిసి నరసింహులు, రాజేష్ ఆనంద్ మరియు గ్రామస్తులు పాండు, రాములు నాయక్, రమేష్ నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

## కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

- ◆ నిరుపేదలకు గూడు కల్పించిన ఘనత మాదే
- ◆ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కాంగ్రెస్ తోనే పేదల సంక్షేమం సాధ్యం అవుతుందని, నిరుపేదలకు నివాసం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్ల మండలంలోని గంగాపూర్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లలో పేదలకు డబల్ బెడ్ రూమ్ ఆశ చూపి బిఆర్ఎస్ మోసం చేసిందని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను కట్టించి పేదలకు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన వెంట గంగాపూర్ సర్పంచ్ గిరి, యువ నాయకుడు వంశీచారి పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే

### బీసీల ఆత్మభిమానాన్ని

# తాకట్టు పెట్టింది నువ్వు కాదా?

**2014 మున్సిపల్ ఎన్నికల్లో అమ్ముడపోయింది నువ్వు కాదా..? బీసీల ఆత్మగౌరవం కోసం పనిచేసే నాయకుడివి కావు నువ్వు .. కమర్షియల్ నాయకుడివి ! ఖబర్దార్ చీర్ల చందర్, బేషరతుగా ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలి నువ్వు చేసే బ్లాక్ మెయిల్ రాజకీయాలకు ఎవరు భయపడరు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్**


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** 2014 మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీ, ఎస్టీ ,ఎస్సీ, మైనార్టీల ఆత్మగౌరవని తాకట్టు పెట్టింది నువ్వు కాదా అని వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఏ పదవులు ఆశించకుండా పనిచేస్తే పనికి తగ్గ ప్రతిఫలం దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆశించిన స్థాయిలో 2014 మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి, కాంగ్రెస్ పార్టీ దక్కాల్సిన మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని చీర్ల విజయ్ చందర్ చేసిన వక్ర బుద్ధితో చైర్మన్ పీఠం నీవల్ల చేజారిన విషయానికి కారణం నువ్వు కాదా అన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి నీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి నీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి నీ అనే నైతిక హక్కు లేదన్నారు. ఎంతసేపు కాంగ్రెస్ పార్టీనీ కుట్రలు చేసి, విచ్ఛిన్నం చేయాలి, గ్రూపు రాజకీయం చేయాలి అనే నెపంతోనే ఉంటావు గాని, కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారి కోసం నువ్వు చేసిన మేలేంటో తెలపాలన్నారు. ప్రచార హార్భాటాలు తప్ప, కాంగ్రెస్ –మిగతా4లో..

# మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

- • నిరక్ష్యం చేస్తే చర్యలు తప్పవు : ఎంఈఓ గణేష్ సింగ్



కోల్పూర్ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

**మాగనూర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** బుధవారం వార్త దినపత్రికలో ప్రచురితమైన ఆన్లైన్లో గుడ్డు ఆఫ్లైన్లో బిస్కెట్ అనే శీర్షిక వెలువడిన కథనానికి మాగనూర్ మండల విద్యాధికారి గణేష్ సింగ్ స్పందించారు. ఆయన కోల్పూర్ ఎంపీపీఎస్ పాఠశాలను బుధవారం తనిఖీ చేసారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారమే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని హెడ్మాస్టర్‌కు సూచించారు. సోమవారం గుడ్డుకు బదులుగా బిస్కెట్, అరటిపండు పెట్టడం సరైంది కాదని, ఖచ్చితంగా ప్రభుత్వ మెనూను పాటించాలన్నారు. విద్యాశాఖ స్టేట్ పాలసీని అమలు చేయాలని, పేరెంట్స్ తీర్మానాలు పరిగణలోకి తీసుకోరాదన్నారు. టీచర్లు మెనూ ప్రకారం గుడ్డు పెట్టకుండా, మరోసారి ఆన్లైన్లో గుడ్డు బిల్లు చేస్తే చర్యలు చేపట్టేందుకు జిల్లా అధికారులకు నివేదిక అంది స్తానన్నారు. అనంతరం పుంజనూరు పాఠశాలను సందర్శించారు. పిల్లలు రాయడం, చదవడాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూప్రకారం పౌష్టికాహారం అందించేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. హెడ్మాస్టర్లు తిమ్మన, నరేష్, సిఆర్పి కృష్ణ ఉన్నారు.

# ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

- • నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్పీ జానకి ధరావత్
- • నిర్వాహకులకు సూచనలు జారీ



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జిల్లాలో నిర్వహించబడే ఉత్సవాలు, ర్యాలీల దృష్ట్యా శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జిల్లా ఎస్పి డి.జానకి నిర్వాహకులకు క్రింది కఠిన సూచనలు జారీ చేశారు. జిల్లా ఎస్పి సూచనలు – తప్పనిసరిగా పాటించవలసినవి 1.ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహించడానికి ముందుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. 2. పోలీసులు సూచించిన మార్గాల్లోనే ర్యాలీ నిర్వహించాలి. 3. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సమయపాలన పాటించాలి. 4. ప్రధాన రహదారులను దిగ్బంధం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. 5. డీజేలు, అధిక శబ్ద పరికరాలు ఉపయోగించరాద. 6. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. 7. అశాంతి లేదా ఉద్రిక్తతలకు దారితీసే నినాదాలు, ప్రవర్తన చేయరాదు. 8. ర్యాలీ భద్రత కోసం నిర్వాహకులు స్వచ్ఛంద సేవకులను నియమించాలి. 9. మహిళలు, పిల్లలు, వృద్ధులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి. 10. ర్యాలీలో పాల్గొనే వాహనాలు నియంత్రిత వేగంతో నడపాలి. 11. ప్రజా ఆస్తులకు నష్టం కలిగితే నిర్వాహకులపై బాధ్యత ఉంటుంది. 12. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. 13. మద్యం సేవించి ర్యాలీలో పాల్గొనడం పూర్తిగా నిషేధం. 14. అత్యవసరవాహనాలరాకపోకలకు మార్గం ఖాళీగా ఉంచాలి. 15. పోలీసు సిబ్బందిసూచనలు తప్పనిసరిగా పాటించాలి. 16. అనుమతి నిబంధనలు ఉల్లంఘించినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయి. –మిగతా4లో..

## మద్దూర్‌లో ముదిరాజ్ కార్యకర్తలపై దాడి

**ఖండించిన తెలంగాణ జాగృతి నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్**



**దామరగిద్ద, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గంలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. మద్దూరు మున్సిపల్ చైర్మన్ పదవి విషయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ ముదిరాజ్ సంఘ నాయకులు తిరుపతి రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బంగారు గోవిందు ముదిరాజ్‌కు చైర్మన్ పదవి ఇస్తామని చెప్పి ఖర్చు చేయించుకొని, చివరికి వేరే వారికి పదవి కట్టబెట్టడం అన్యాయమని వారు ఆరోపించారు. ఈ విషయమై వివరణ కోరుతూ నిరసనకు దిగిన గోవిందు ముదిరాజ్ అనుచరులు తిరుపతి రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసుల జోక్యంతో నిరసన కారులను చెదరగొట్టినట్లు సమాచారం. తమ కార్యకర్తలపైనే దాడి చేయించడం తీవ్రంగా ఖండనీయమని నాయకులు పేర్కొన్నారు.తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజ్ సమాజానికి అన్యాయం జరిగిందని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**మండల పశు వైద్యాధికారి డాక్టర్ నరేష్**



పశువులకు టీకా వేస్తున్న పశు వైద్యాధికారి

**కోయిలకొండ ఫిబ్రవరి 16, ప్రభాత వార్త:** మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ నరేష్, అభంగపట్నం పశు వైద్యశాఖ లైవ్ స్టాక్ ఆఫీసర్ జయప్రద లు అన్నారు. బుధవారం కోయిలకొండ మండలంలోని ఆచార్య పూర్ గ్రామ శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం దగ్గర గల గోశాలలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వీరభద్ర స్వామి దేవాలయ ధర్మకర్త, ఆలయ పూజారి తమ్మలి విజయ్ కుమార్ వేద మంత్రోక్షణాలు గావించి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పశు వైద్యాధికారులు డాక్టర్ నరేష్, లైవ్ స్టాక్ ఆఫీసర్ జయప్రద లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో పశువులకు ప్రబలే వ్యాధుల గురించి రైతులకు అవగాహన కలిగించారు. అనంతరం కృత్రిమ గర్భాధారణ చేసిన పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. ఆవులకు, గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దూడలకు నట్టల మందులను తాపారు. వివిధ వ్యాధులకు సంబంధించిన మందులను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ విజయ్, గోపాల మిత్రులు బి వెంకట్ నారాయణ, రామకృష్ణ, వెంకోజీ, రామకృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఉప తహసీల్దార్‌కు ఘనంగా నివాళులు



ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయం వద్ద పరుష్ నాయక్ కు నివాళులు అర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** తహసీల్దార్ కార్యాలయం ఉప తహసీల్దార్ పరుష్ నాయక్ ఆకాల మరణం తీరని లోటని ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. అందరితో కలిసిపోయే మనసత్వం వ్యక్తి ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం చనిపోవడం తీరనిలోటని,ఆయన చేసిన సేవలు మరువ లేమని పలువురు కొనియాడారు. ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌గా పనిచేస్తున్న పరుష్ నాయక్ మృతి చెందడం తీరనీ లోటని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, గిరిజన నేతలు పలువురు సంతాపం వ్యక్తం చేశారు. పరశు నాయక్ చనిపోవడం కుటుంబం తో పాటు మండల ప్రజలకు తీరని లోటు అని పలువురు ప్రసంగించారు. సంతాపం వ్యక్తం చేసినవారిలో సీనియర్ అసిస్టెంట్ బాల్ రాం నాయక్, రెవెన్యూ సిబ్బంది అబ్రహార్, ఆదిత్య, శివ, రమణమ్మ, శేఖర్, మల్లికార్జున్, జిపిఓలు ఆంజనేయులు, వెంకటేష్, ఆంజనేయులు,ఉమ, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## తిర్మాలపూర్‌లో వైద్య శిబిరం నిర్వహించాలి



గ్రామ సర్పంచ్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** తమ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామ సర్పంచ్ స్థానిక వైద్యులను కోరిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని తిర్మాలపూర్ గ్రామంలో ఈనెల 21న వైద్య శిబిరం నిర్వహించాలని ఆ గ్రామ సర్పంచ్ బరిగెల శ్రీకాంత్ బుధవారం స్థానిక వైద్యులను కోరారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు డా. స్వప్న , డాక్టర్ శివలిల లు తిర్మాలపూర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని ఆ గ్రామ సర్పంచు బరిగెల శ్రీకాంత్ కోరడం శుభపరిణామం అని, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ సర్పంచుగా గెలుపొంది మొట్టమొదటిసారిగా స్థానిక ఆసుపత్రిని సందర్శించడంతో వైద్య అధికారులు డా. స్వప్న, డా. శివలీలలు తిర్మాలపూర్ గ్రామ సర్పంచ్ బరిగెల శ్రీకాంత్‌ను వైద్య సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. స్వప్న, డా. శివలీల, వైద్య సిబ్బంది ఫార్మాసిస్ట్ కుమార చారి, నర్సింగ్ ఆఫీసర్ ఉపత్, ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్, సందీప్ తదితరులున్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

**ధన్వాడ, జనవరి 18 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని మందిపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులైతే" అనే ఆలోచనతో ఒకరోజు పాటు విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా దీపిక కలెక్టర్‌గా, భానుప్రియ డీఈవోగా, నందు పాఠశాల హెచ్‌ఎంగా, సాయి వర్షిత ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా 16 మంది విద్యార్థులు వివిధ తరగతులకు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో బోధన నిర్వహించగా, ఇతర విద్యార్థులు ఆసక్తిగా వినిపించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సింలు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శ్రీవాణి, అనిత పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఉత్తమంగా విద్యాబోధన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం, బోధనా నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యమని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది.

## పుట్టపల్లి గ్రామంలో రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన ట్రైని ఐపీఎస్, ఐఏఎస్‌లు



పంట పొలాలలో ట్రైనీ అధికారులు

**దేవరకద్ర, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని పుట్టపల్లి, కౌకుంట్ల, అప్పంపల్లి, పలు గ్రామాలలో శిక్షణలో ఉన్న ఐపిఎస్, ఐఏఎస్, అధికారులు రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించి, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధం, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల, పనితీరును వారు సమీక్షించారు. గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కార సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, సమర్థత, ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఎంఈఓ, తహసిల్దార్ సుందర్ రాజ్, కౌకుంట్ల సర్పంచ్ నరేష్ కుమార్, పుట్టపల్లి సర్పంచ్ చెన్నకేశవులు, అంగన్‌వాడీ కార్యకర్తలు టీచర్స్, ఆశా వర్కర్లు, ఆయాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను బిఆర్ఎస్ ప్రభుత్వం దగా చేసింది

**ఆరు మండలాలకు సబ్సిడీగా దాదాపు రూ.35 లక్షలు**

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**





రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రాయితీ పై వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** సన్నచిన్న కారు రైతులతో పాటు అన్ని వర్గాల రైతులకు ఎంతో మేలు చేసే వ్యవసాయ యాంత్రీకరణ స్కీంను గత బిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసి,రైతులను బిఆర్ఎస్ ప్రభుత్వం దగా చేసిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పరికరాలు రోటవేటర్ ,కల్టివేటర్, వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవరకద్రఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలోని 6 మండలాలకు దాదాపు 35 లక్షలు సబ్సిడీతో కూడిన పనిముట్లను రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు చిన్న సన్న కారు మహిళా రైతులకు 50 శాతం, 5 ఎకరాలు పైబడిన రైతులకు 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అర్హతను బట్టి వరి కోత యంత్రాలు, కలుపు మొక్కలు, విత్తనాలు, ఎరువులు, కలిపి వేసే యంత్రాలు గడ్డి కట్టలు కట్టే యంత్రాలు, రోటవేటర్స్ బ్యాటరీ స్ప్రేర్స్, పవర్ స్ప్రేర్స్, పవర్ టిల్లర్స్, సెల్లార్స్ పవర్ విడర్తో, పాటు ట్రాక్టర్లను అందిస్తుందని, రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం దాదాపు రూ. 100కోట్ల నిధులతో ఈ నెల 9న వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునర్ ప్రారంభించిందన్నారు. అదేవిధంగా రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతే నిజమైన రాజు అని మరోసారి నిరూపితమైంది. రైతు కష్టాలను గుర్తించి వారి సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ, ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, మున్సిపల్ చైర్మన్ దమయంతి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు,అగ్రికల్చర్ ఏవో రాజేందర్ అగర్వాల్, కౌకుంట్ల ఏవో శివకుమార్, తహసిల్దార్ దీపికా రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, చంద్రమౌళి, కోన రాజశేఖర్, గోపన్ పల్లి సర్పంచ్ బాల్‌రాజ్ ,రాంబాబు, ముచ్చింతల సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, బల్స్ పల్లి శంకర్, గౌని రాము, గోవర్ధన్ రెడ్డి, ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి, కొండ శ్రీనివాస్ రెడ్డి, గద్దె గూడెం పూర్ణిత, జాఫర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మామిడిలో నల్ల తామర పురుగు ఉధృతికి పలు సూచనలు

**తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు**



విష్ణువర్ధన్ రెడ్డి రైతు మామిడి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**వీపనగండ్ల ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** ప్రస్తుత పరిస్థితులైన పూత మరియు పిందె సమయంలో మామిడి తోటలలో చేపట్టవలసిన చర్యలు మరియు మామిడి తోటల్లో క్షేత్రస్థాయిల సమస్యలైనా చీడ, పీడల బెడద అధికంగా ఉండటం, పూత సమయంలో నల్ల తామర ఉధృతి అధికముగా ఉండటం మరియు పిందె ఏర్పడుట తక్కువగా ఉండటం వంటి సమస్యల అధ్యాయానికి తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల, పాన్గల్ మండలలలోని రైతులు తెల్లరాళ్లపల్లికి శేఖర సంగినేనిపల్లికి చెందిన లక్ష్మణ్ తూముకుంటకు చెందిన రాముడు భీబనగండ్లకు చెందిన విష్ణువర్ధన్ రెడ్డి హోటలను తోటలను పరిశీలించడం జరిగింది వీపనగండ్ల ఉద్యానవన శాఖ అధికారి కృష్ణయ్య తెలిపారు ఈయనతో పాటు జిల్లా వనపర్తి జిల్లా ఉద్యాన శాఖ అధికారి విజయ భాస్కర్ రెడ్డి శాస్త్రవేత్తలు పాల్గొని పలు సూచనలు సలహాలు ఇచ్చినట్లు వారు తెలిపారు బుధవారం నాడు పరిశీలించి పలు సూచనలు చేయడం జరిగింది అందులో ముఖ్యంగా మామిడి తోటలు సాధారణంగా అక్టోబర్ చివరి వారం నుండి నవంబర్, డిసెంబర్ మాసాలలో వచ్చిన పూత పిందెగా మారడం జరిగింది. ఆలస్యంగా వచ్చిన పూత పిందే చాలా తక్కువగా ఉందని గమనించడం జరిగింది. ఇందులో ముఖ్యంగా మామిడి పూతలో నల్లతామర ఉధృతి చాలా అధికంగా ఉండడం అదేవిధంగా పగటి సమయంలో పొగ మంచు ఉండడం ద్వారా చల్లని వాతావరణంలో ఈ తేనె మంచు మరియు నల్ల తామర ఉధృతి చాలా అధికంగా ఉండి పూతను తిని పిందే కట్టకుండా జరుగుతుందని గమనించడం జరిగింది. ఈ నల్ల తామర ఉధృత్రిని అరికట్టడానికి పలు రకాల సూచనలు చేయటం జరిగింది. ఫిప్రోనిల్ 2 ఎమ్ ఎల్ + హేక్సకనాజోలు 2 ఎం ల్ లేదా ఫిప్రోనిల్ 40+ ఇమిడాక్లోప్రిడ్ 40 0.4 గ్రామ్ + ఎం 45 2 గ్రా లేదా దినేటోఫురాన్ 0.2 గ్రామ్+ నాటివో 0.5 గ్రామ్ లేదా సొలొమోను 1 ఎంల్ + కంటోఫ్ ప్లస్ 2 ఎంల్ పైన సూచించిన మందులను మార్చి మార్చి 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయడం ద్వారా ఈ నల్ల తారమార ఉధృతని సమర్థవంతంగా అరికట్టవచ్చు. పిండె బటాని గింజ సైజులో ఉన్నప్పుడు 10 సంవత్సరాల చెట్లకు నత్రజని 500 గ్రా , భాస్వరం 1 కేజీ , పొటాష్ 500గ్రా ఎరువులను క్రమం తప్ప కూడా చెట్లకు అందించాలి. అంతేకాకుండా సూక్ష్మ పోషకాలు అయినా జింకు 150గ్రా , బోరాన్150గ్రా ఒక వారం వదిలి అందించాలి. పూత మరియు పిందే పసుపు రంగులోకి మారి రాలకుండా 13.0.45 10గ్రా +ఫార్ములా 4 5 గ్రా+ ట్రీన్ను 1.25గ్రా ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలి. అంతేకాకుండా నాఫ్తలిన్ ఎసిటిక్ యాసిడ్ 1ఎమ్ ఎల్ 4.5లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవడం ద్వారా పిందే మరియు పూత రాలకుండా కాపాడుకోవచ్చు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామల రైతు సోదరులు మరియు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్. వీణ జోషి అసోసియేట్ డీన్, హార్టికల్చర్ కాలేజ్ మోజర్ల, డాక్టర్ బి.మాధవి, డాక్టర్ సహనాజ్ , డాక్టర్‌భాగ్య శాలి వనపర్తి జిల్లా ఉద్యాన , పట్టు పరిశ్రమ అధికారి విజయ భాస్కర్ రెడ్డి, ఉద్యాన అధికారి కృష్ణయ్య , సిడిపి క్లస్టర్ ఆఫీసర్ రవి పాల్గొన్నారు.

## ప్రజలకు 108 అంబులెన్స్ ద్వారా అందుబాటులోకి వైద్యం



సంవత్సరం గడిచిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వైద్యులు

**వీపనగండ్ల ఫిబ్రవరి 18, ప్రభాత వార్త:** ప్రజలకు 108 ద్వారా వైద్యం అందుబాటులోకి వస్తుంది అని వీపనగండ్ల మండల కేంద్రంలోని 108 సిబ్బంది ఈఎంటి టెక్నీషియన్ మేకల సుకుమార్ రాము తెలిపారు. బుధవారం నాడు వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 అంబులెన్స్ వచ్చి సంవత్సరం అయిన సందర్భంగా వారు కేక్ కట్ చేసి వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శిల్ప డాక్టర్ వంశీకృష్ణ డాక్టర్ రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు 108 అంబులెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని ఆపదలో ఉన్న రోగులను తక్షణమే వారికి అందించే వైద్యం దగ్గరకు తీసుకుపో యి కాపాడడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సంవత్సర కాలం లో అనేక కేసులు 108 అంబులెన్స్ లో తీసుకుపోయి ప్రాణాలు రక్షించడం జరిగిందని ఈఎంటి టెక్నీషియన్ సుకుమార్ రాములు తెలిపారు. ఈ సంవత్సర కాలంలో మొత్తం కేసులు 922 రాగా అందులో ప్రెగ్నెన్సీకి సంబంధించి 275 కాగా మెడికల్ సంబంధించిన కేసులు 647 రావడం జరిగిందని వారు తెలిపారు. ఇందులో ప్రధానంగా గుండె జబ్బు పురుగుమందు పాయిజన్ లాంటి పాముకాటు గుండె నొప్పి తదితర వాటికి తక్షణ వైద్యం అందించడం జరిగిందని సిబ్బంది తెలిపారు. మారుమూల ప్రాంతమైన వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా భవిష్యత్తులో ఇంకా మెరుగైన సేవలు 108 అంబులెన్స్ ద్వారా అందించడానికి కృషి చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ అంబులెన్స్న్ను ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సంవత్సర క్రితం ప్రారంభం చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్స్ మైనుద్దీన్ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 20 ఏళ్లుగా సేవలు.. ఇంకా శాశ్వతం కాలేదు

**టైపిస్టు కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను శాశ్వతం చేయాలంటూ కలెక్టర్‌కు వినతి**



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖపరిధిలో,భూపరిపాలన ప్రధానకమిషనర్ కార్యాలయం ఆధీనంలో పనిచేస్తున్న టైపిస్టు కమ్‌కంప్యూటర్ ఆపరేటర్లు (టీసీసీవోలు) తమ సేవలను శాశ్వతంచేయాలని జిల్లాకలెక్టర్ సిక్తా పట్నాయక్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రవి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 33జిల్లాల్లో సుమారు 632మంది టీసీసీవోలు దాదాపు 20సంవత్సరాలుగా రెవెన్యూ,ఎన్నికలు పరిపాలనకు సంబంధించిన కీలక కార్యక్రమాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటికీ తమ ఉద్యోగాలు శాశ్వతం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009, 2014, 2018, 2023 ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితాల తయారీ, ఫారం6, 7, 8, 8ఏ దరఖాస్తుల పరిశీలన, 2017 భూ రికార్డు నవీకరణ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డేటా నమోదు, భూ రికార్డుల సంరక్షణ, గణాంక పట్టికల నిర్వహణ వంటి అనేక కీలక పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల విధులు, బీపీఎల్ కుటుంబాల వివరాల సేకరణ, సిబ్బంది వివరాల నిర్వహణ, పరిపాలనా నివేదికల తయారీ వంటి బాధ్యతలను కూడా నిర్వర్తిస్తున్నప్పటికీ తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత లభించడం లేదని పేర్కొన్నారు. ఇరవై సంవత్సరాలుగా నిరంతర సేవలందిస్తున్నప్పటికీ తక్కువ వేతనాలతో పని చేయాల్సి వస్తోందని, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఎస్‌ఈఆర్‌పి జీవో నెంబర్ 11 ప్రకారం ఇతర విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కల్పించిన అవకాశాలను తమకు కూడా వర్తింపజేయాలని కోరారు. తమ సేవలను తక్షణమే శాశ్వతం చేయడంతో పాటు కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం వర్తింపజేయాలని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమకు న్యాయం చేయాలని టీసీసీవోలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

**బాలానగర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని బుధవారం మహబూబ్ నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ సందర్శించారు. కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని 37 గ్రామ పంచాయతీలలో ఓటర్ జాబితా తప్పు ఒప్పులను సవరించాలన్నారు. మండల అధికారులు గ్రామాలలో బిఎల్‌ఓలు అధికారులు కలిసి గ్రామంలోని ప్రతి ఇల్లు తిరిగి, 100 శాతం ఓటర్ జాబితాను సిద్ధం చేయాలన్నారు. మండలంలోని రేషన్ కార్డు దారులు, వారి కుటుంబ సభ్యులలో ఈకేవైసీ పూర్తికాని వారిని, సమీపంలోని రేషన్ షాప్ లో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకునేలా రేషన్ డీలర్లకు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ లిఖితారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో మద్దూరు విద్యార్థిని ప్రతిభ



పురస్కారం అందుకుంటున్న విద్యార్థిని

**మద్దూర్,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** హిందీ సేవాసదన్ మహా విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హిందీ ప్రతిభ పరీక్షలో మద్దూరు పట్టణానికి చెందిన గీతాంజలి హై స్కూల్ విద్యార్థిని ఆర్తి విశిష్ట ప్రతిభ కనబర్చింది. ఆరో తరగతి విభాగంలో ద్వితీయ స్థానం సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చింది. ఈ సందర్భంగా రాజ్ భవన్ హైదరాబాద్ లో రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకుంది. ఆర్తి విజయంపై ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.విద్యార్థిని కృషి, గురువుల మార్గదర్శకత్వం ఫలితమే ఈ విజయం పేర్కొన్నారు. మద్దూరు పట్టణానికి ఇది గర్వకారణమని స్థానికులు అభినందించారు.

## శివాజీ జయంతి వేడుకలకు ఏర్పాట్లు

**మద్దూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో 396వ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు మసగళ్ళ అంజి గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా గురువారం ఉదయం 8:30 గంటలకు అమరగడ్డ రామాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యువత, భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేసి సామాజిక సేవలో భాగస్వాములు కావాలని కోరారు.సాయంత్రం 5గంటలకు అమరగడ్డ రామాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమ వుతుందని తెలిపారు.శోభాయాత్ర మద్దూరు పట్టణ ప్రధాన వీధుల గుండా భక్తి, దేశభక్తి నినాదాల మధ్య కొనసాగుతుంద"ని తెలిపారు.

## ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు



భారీ బందోబస్తు మధ్య సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** మండలంలోని పెద్దాపూర్ గ్రామపంచాయతీ శివారు గ్రామమైన రాజ నగరంలో సర్వే నెంబర్ 9లో 2 ఎకరాల 10 గుంటల భూమిని బుధవారం రెవెన్యూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ అద్దంకి సునీత ఆధ్వర్యంలో సమగ్ర సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప్పునుంతల ఎస్ ఐ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి సర్వే నిర్వహించారు.అనంతరం పొలం చుట్టు ముట్టు రక్షణ కవచం ఏర్పాటు చేశారు. సర్వే నిర్వహించిన వారిలో తహసీల్దార్ అద్దంకి సునీత, ఎస్ ఐ వెంకట్ రెడ్డి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ,జిపిఓ ఆంజనేయులు,సర్వేయర్ షఫీ ఉల్లాఖాన్ , పోలీసులు ఉన్నారు.

## ఉప్పునుంతల ఆస్పత్రిని సందర్శన

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మండల ఉప్పునుంతల ఆసుపత్రిని బుధవారం జిల్లా ఇమ్యునేషన్ అధికారి డా.సురేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ స్టాక్ రిజిస్టర్లు, ఐఎల్ఆర్ డీప్ ఫ్రిడ్జ్ టెంపరేచర్ రిజిస్టర్ వెరిఫికేషన్ నిర్వహించారు. అనంతరం ఉప్పునుంతల వైద్యశాల ఉపకేంద్రం, సదగోడు పల్లె దావఖానను సందర్శించారు. వారికి రోగులకు అందించాల్సిన వైద్యంపై పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునేషన్ అధికారి డా.సురేష్ కుమార్ తో పాటు డా. స్వప్న, డా. శివలిల, ఫార్మసిస్ట్ కుమార చారి, పిహెచ్‌ఎన్ శాంతా బాయి, నర్సింగ్ ఆఫీసర్ ఉపత్ ,నిసబేగం, సూపర్ బ్రదర్ ప్రభావతి, శ్రీనివాసులు, హెచ్‌ఎ విజయ్ కుమార్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో కేజీబీవీ విద్యార్థినుల విజయం

**ధన్వాడ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ధన్వాడలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవీ విద్యార్థినులు జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ నెల 15న కే లో ఇండియా ట్రైబల్ గేమ్స్‌లో భాగంగా న్యూఢిల్లీలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. కేజీబీవీకి చెందిన కె. గీత రజత పతకం సాధించగా, నాగలక్ష్మి కాంస్య పతకం గెలుచుకుని పాఠశాలకు గర్వకారణము సాధించారు కఠినమైన పోటీలో పట్టుదలతో పోరాడి ఈ విజయాలను అందుకున్నారు. విద్యార్థినుల విజయంపై జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కల్పన, పీటీలు, పీడీలు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించాలని కాంక్షించారు.ఈ విజయంతో ధన్వాడ కేజీబీవీ విద్యార్థినులు జిల్లా స్థాయిలో క్రీడా ప్రతిభను మరింతగా చాటారు.

## నిర్ణయాత్మక సంఖ్యలో దళితులున్నా సమన్యాయం దక్కలేదు

**70 ఏళ్లలో దళితులకు దక్కని అధికారం, కుల నిర్మూలన పోరాట సమితి దాసరి శేఖర్**

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికలో దళిత సామాజిక వర్గానికి జరిగిన అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేపీఎస్ నాయకులు దాసరి చంద్రశేఖర్ అన్నారు.



మాట్లాడుతున్న కుల నిర్మూలన పోరాట సమితి దాసరి శేఖర్

మున్సిపాలిటీలో 16 వార్డుల్లో 5 వార్డుల్లో దళిత సామాజిక వర్గానికి చెందిన వారు (4గురు ఎస్సీ, 1 ఎస్టీ) ఉన్నా కేవలం ఇద్దరు మాత్రమే రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు ఉన్నా వైస్ చైర్మన్ పదవి న్యాయ పరంగాను, సంఖ్యా పరంగాను దళిత సామాజిక వర్గానికి రావాల్సి ఉన్నా రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించడం దళితులకు తీరని లోటు అని తెలియజేశారు.దాదాపు 70 సంవత్సరాల గణతంత్ర రాజ్యపు విధానంలో కేవలం 3 గా ఉన్న ఆధిపత్య అగ్రకుల శక్తులే నిర్ణయాత్మక స్థానంలో ఉన్నారు అనడానికి మక్తల్ వైస్ చైర్మన్ పదవి ఎంపికనే నిదర్శనమని ఇలాంటి విధానాలను దళిత, వెనకబడిన కులాల ప్రజలతో పాటు పేద వర్గాల ప్రజలు తిప్పికొట్టవలసిన అవసరం ఉందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయ ప్రాతినిధ్యంలో ఆర్థిక విధానాలలో సామాజిక న్యాయం కోసం పీడిత ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిస్తూ మక్తల్ మున్సిపాలిటీలో 40%కి పైగా ప్రజలకు ప్రతినిధులుగా ఉన్న దళిత కౌన్సిలర్లలో ఏ ఒక్కరికీ వైస్ ఛైర్మన్ పదవి ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి చంద్ర శేఖర్, విజయ్ కుమార్, లింగన్న, కమ్మరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జోష్ అందుకున్న కొబ్బరికాయ టెండర్లు

**నవాబుపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** పర్వతాపూర్ మహిమాన్విత మైసమ్మ ఆలయ కొబ్బరికాయలు, వాహన పూజ సామాగ్రి విక్రయ టెండర్లు జోష్ అందుకున్నాయి. జిల్లా దేవాదాయ శాఖ అధికారులు వీణాదరి ఆలయ ఈఓ నర్సింలు, గ్రామ సర్పంచ్ బాలయ్య,మరియు గ్రామ ప్రజాప్రతినిధుల సమక్షంలో బుధవారం ఆలయంలో



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నిర్వహించిన టెండర్లలో భాగంగా, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం వేలం పాటలో మూడు నుంచి నాలుగు లక్షల వరకు అధికంగా పోటీదారులు పాట పాడి దక్కించుకున్నారు. కొబ్బరికాయల వేలం హోరా హోరీగా సాగి తుదకు కాకర్లపాడు గ్రామానికి చెందిన గడ్డమీది సాయిలు 35లక్షల 33 వేలకు టెండర్ దక్కించుకోగా, వాహన పూజ సామాగ్రి టెండర్ను, సేరి వెంకటయ్య 18 లక్షలకు తగ్గించుకున్నాడు. ఈ వేలం పాటను, జిల్లా ఎండోమెంట్ దేవాదాయ శాఖ అధికారుల, మరియు మైసమ్మ ఆలయ సిబ్బంది గ్రామ ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రత్యక్షంగాజరిగింది. వేలం పాటలో రమేష్, సాయిలు,చెంద్రయ్య, పిచ్చకుంట్ల, పుట్ట రాజు,సేరి వెంకటయ్య, కోమటి సత్యం, వేలం పాటలో పాల్గొన్నారు. సమయం సరిపోక పూల విక్రయ వేలం వాయిదా పడింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా టీఎన్‌జీవో కార్యవర్గం ఏకగ్రీవం

**నారాయణపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** జిల్లా టీఎన్‌జీవో కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు జిల్లా అధ్యక్షుడిగా ఎం.నర్సింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దామోదర్, ఉపాధ్యక్షుడిగా ఉదయభాను, మహిళా ఉపాధ్యక్షురాలిగా శశికళ, కోశాధికారిగా చిన్న బాల్‌రాజ్, కార్యదర్శిగా అజయ్‌కుమార్‌తో పాటు మొత్తం 30 మంది సభ్యులను అన్ని శాఖల ఉద్యోగులు ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ ఎన్నికల అధికారి రాజేష్ పర్యవేక్షణలో,



జిల్లా కమిటిని సన్మానించిన దృశ్యం

ఉమ్మడి జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, కార్యదర్శి చంద్రు నాయక్ సమక్షంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం. నర్సింహా రెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న అన్ని శాఖల ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. టీఎన్‌జీవో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ఎల్లప్పుడూ ఉద్యోగులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.నారాయణపేట జిల్లాను 17 ఫిబ్రవరి 2019న ఏర్పాటు చేసినట్లు గుర్తుచేసుకుంటూ, ఏడు సంవత్సరాల అనంతరం యాదృచ్ఛికంగా 18 ఫిబ్రవరి 2026న జిల్లా టీఎన్‌జీవో కమిటీ ఏర్పాటు కావడం విశేషమన్నారు.అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి నియామక పత్రాలను అందజేశారు.

## బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**ఫిబ్రవరి 23న చలో హైదరాబాద్" పిలుపు**

**నారాయణపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** ఆశా కార్యకర్తలకు పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు, బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఫిబ్రవరి 23న"చలో హైదరాబా ద్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాల మణి,(సీఐటీయూ) జిల్లా నాయకుడు నరహరి తెలిపారు. పేట జిల్లా కేంద్రం లోని జిల్లా వైద్య అధికారి కార్యాలయంలో జిల్లా రోగ నిరోధకత అధికారి శైలజకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కొందరికి మాత్రమే పారితోషికాలు చెల్లించి, మిగిలిన వారిని పెండింగ్‌లో ఉంచడం అన్యాయమని విమర్శించారు. ఆశా కార్యకర్తలకు ప్రతినెలా క్రమం తప్పకుండా పారితోషికాలు చెల్లించడంలో ప్రభుత్వం నిరక్ష్యం చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు లెప్రసీ సంబంధిత బిల్లులు గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపా రు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 18,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు ఫిబ్రవరి 23న హైదరాబాద్‌లోని కోటి కమిషనరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆశా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో ఆశా యూనియన్ జిల్లా నాయకులు శ్రీదేవి, విద్యార్థి సంఘం నాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పెబ్బేరు ప్రజల కృషి ఎనలేనిది..!!

**మున్సిపల్ సాధారణ ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించిన ప్రజలు**

**కొలువుదీరిన కొత్త పాలకవర్గం పాదరదర్శకంగా పాలన**

**అందించాలని సూచన : శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**

**రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి**

**వనపర్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ అలాగే నూతన పాలకవర్గాలు ఇటీవల కొలువు తీరింది. సోమవారం నూతన పాలకవర్గం, చైర్మన్, వైస్ చైర్మన్ లు పెబ్బేరు మున్సిపాలిటీలో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి తో కలిసి శివసేన రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై , కొత్తగా ఎన్నికైన పాలకవర్గాన్ని ఆప్యాయతగా పలకరిస్తూ శాలువా పూల బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఏర్పాటు చేసిన




నూతన పాలకవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు

విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే మేఘా రెడ్డితో కలిసి శివసేన రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ మొన్న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డుల్లో 7 మంది సభ్యులు గెలిచారని, పెబ్బేరు ప్రజల దీవెనలు ఎనలేనివని అన్నారు. పెబ్బేరు మున్సిపాలిటీ నూతన పాలకవర్గం పారదర్శకంగా పాలన అందించాలని సూచించారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత ,పెబ్బేరు ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా , కృషి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, శివసేనరెడ్డిలు ఉన్నామని భరోసా కల్పించారు. తెలంగాణలో మున్సిపాలిటీ ఎన్నికల్లో దాదాపుగా 95 కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ పీఠాలను కైవసం చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. వనపర్తి ఐదు మున్సిపాలిటీల్లో గెలిచిన శుభ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వనపర్తి జిల్లాలో ఉన్న మున్సిపాలిటీల అభివృద్ధి అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలువురు పాల్గొన్నారు.

# మక్తల్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు

**నాలుగు రోజులపాటు సీఎం కప్ పోటీలు**

**క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో ఏర్పాట్లు**

**పరిశీలించిన మఖ్తల్**

**మున్సిపల్ ఛైర్ పర్సన్ వాకిటి హనుమంతు**

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** సీఎం కప్ నిర్మాణంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి నేతృత్వంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మక్తల్ పట్టణం ఈనెల 20 నుంచి 23 వరకు నాలుగు రోజుల పాటు ఆతిథ్యం ఇవ్వనందని మక్తల్ మున్సిపల్ ఛైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మక్తల్ మినీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో వార్డు కౌన్సిలర్లతో కలిసి మాట్లాడుతూ క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సొంత నియోజకవర్గం మక్తల్ పట్టణంలో తొలిసారిగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు సీఎం కప్ లో భాగంగా ఏర్పాటు చేశారని, 33 జిల్లాల నుంచి మహిళల్లో పురుషుల విభాగంలో 66 జట్లు కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. సుమారు 1500 మంది పైగా క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, పీఈటీలు, ప్రముఖులు పాల్గొంటారని ఈ సందర్భంగా క్రీడా పోటీలకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో క్రీడారంగంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, క్రీడలలో



సీఎం కప్ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

తెలంగాణ నుంచి లింక్స్ స్థాయికి చేరుకునే విధంగా కోచింగ్ తో పాటు ఇతర అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మక్తల్ పట్టణంలో సైతం దాదాపు 40 కోట్లకు పైగా నిధులతో మినీ స్టేడియం చేపడుతున్నారని,మఖ్తల్ ను సరికొత్త క్రీడా హబ్ గా తీర్చిదిద్దేందుకు మంత్రి వాకిటి శ్రీహరి చర్యలు చేపడుతున్నారని అన్నారు. సీఎం కప్ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సరిత గోవిందరావు, కలాల్ శ్రీవిద్య నిరంజన్ గౌడ్, రహీం పటేల్, ఆల్కూరి పావని, జుట్ల అనిత, కరీమ్ మహేష్ , మార్కెట్ డైరెక్టర్లు శ్రీనివాస్, ఫయాజ్, అంజి,జిల్లా క్రీడా యువజనశాఖ అధికారి వెంకటేష్ శెట్టి, పీఈటీలు విష్ణువర్ధన్ రెడ్డి, రవికుమార్, నరేష్ కుమార్, మోలాలి, రాఘవేందర్, భీమ్ రెడ్డి, రాజేశ్వరి, పరంజ్యోతి, రూప, మీనా కుమారి, సౌమ్య, రేణుక, స్వరూపస్థానిక నాయకులు నీలప్ప ముదిరాజ్, వాకిటి శ్యామ్, కల్లూరి గోవర్ధన్,తదితరులు పాల్గొన్నారు.

## పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలి

**అన్ని సంస్థల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు తప్పనిసరి**

**నారాయణపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉందని జిల్లా సంక్షేమాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్ తెలిపారు. 2013 ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు,విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు,పరిశ్రమలు తదితర అన్ని చోట్ల తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు మహిళల పట్ల అశ్లీల వ్యాఖ్యలు చేయడం, అసభ్య ప్రవర్తన ప్రదర్శించడం, శారీరక లేదా మానసిక వేధింపులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ప్రతి సంస్థ తమ ఐసీసీ వివరాలను మహిళా,శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న పోర్టల్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. నమోదు చేయని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రైవేటు సంస్థలు వెంటనే ఐసీసీని ఏర్పాటు చేసి, పూర్తి వివరాలను షీబాక్స్ పోర్టల్‌లో నమోదు చేయాలని, కమిటీ సభ్యుల వివరాలను జిల్లా సంక్షేమాధికారి కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. షీబాక్స్ పోర్టల్ ద్వారా మహిళలు నేరుగా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని, ఫిర్యాదుల స్థితిని కూడా తెలుసుకునే సౌకర్యం ఉందని తెలిపారు. ఫిర్యాదు చేసిన మహిళల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, ఎలాంటి భయం లేకుండా ముందుకు రావాలని కోరారు. సంఘటన జరిగిన తేదీ నుండి మూడు నెలల లోపు ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందన్నారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీలో సంస్థలోని సీనియర్ మహిళా ఉద్యోగి అధ్యక్షురాలిగా ఉండాలని, కనీసం ఇద్దరు సభ్యులు మహిళా హక్కులు లేదా సామాజిక సేవలపై అవగాహన కలిగి ఉండాలని, ఒక బాహ్య సభ్యుడు స్వచ్ఛంద సంస్థ లేదా మహిళా సమస్యలపై అనుభవం ఉన్న వ్యక్తి కావాలని తెలిపారు. కమిటీలో కనీసం 50 శాతం మహిళలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళల హెల్ప్‌లైన్ 181, పోలీస్ హెల్ప్‌లైన్ 100 నంబర్లను అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని సూచించారు. మహిళల భద్రత, గౌరవం కాపాడటం ప్రతి సంస్థ బాధ్యత అని జిల్లా సంక్షేమాధికారి రాజేందర్ గౌడ్ పేర్కొన్నారు.



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్

## ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్

**గద్వాల ఫిబ్రవరి 18, ప్రభాత వార్త:** రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ప్రత్యేక అవసర విద్యార్థులను జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అభినందించారు.బుధవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన జిల్లాకు చెందిన విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో జిల్లాకు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్ లోని దోమలగూడ ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఈనెల 17న సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన విష్ణు లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, షాట్‌పుట్‌లో రెండో స్థానం సాధించి విశేష ప్రతిభ చూపించారు. నిఖిత క్యారమ్స్‌లో, షాట్‌పుట్‌లో రెండో స్థానం సాధించింది. వినయ్ కుమార్, విజయేంద్ర రన్నింగ్ విభాగంలో రెండో స్థానం సాధించి జిల్లాకు పేరు తెచ్చారు. విద్యార్థులు తమ శారీరక పరిమితులను అధిగమిస్తూ ధైర్యంగా పోటీల్లో పాల్గొని విజయాలు సాధించడం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు.ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, ఇటువంటి రాష్ట్రస్థాయి పోటీలు వారికి మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ప్రతిభ కనబరచాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి విజయ లక్ష్మి, సెక్టోరియల్ అధికారులు కరెప్ప, మైఖేల్, శ్రీనివాసులు, శిక్షకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.




ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సంతోష్

## ఉపాధితో లబ్ధి పొందుతున్నారా..!

**చిన్నచింతకుంట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** ఉపాధి పనుల ద్వారా లబ్ధి పొందుతున్నారా అంటూ శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూలీలను అడిగి తెలుసుకున్నారు. బుధవారం లాల్‌కోట గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. కోయిల్‌సాగర్ సంబంధించిన పాటు కాలువ పనులను చేపడుతున్న కూలీలతో మాట్లాడుతూ రోజుకు ఎంత కూలి వస్తుంది, ఆ కూలి సక్రమంగా అందిస్తున్నారా, ఎంతమంది కూలీలు పనిచేస్తున్నారు. వారికి సంబంధించిన జాబ్ కార్డులు ఉన్నాయా అనే అంశాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వ్యవసాయానికి సంబంధించిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్గానిక్ పంటలను పరిశీలించి ఈ పంట ద్వారా కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి నిర్వహణ చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం పై అంగన్వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఏ విధంగా ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో క్షేత్రస్థాయి పర్యటన వల్ల చాలా అంశాలను తెలుసుకోవడం జరిగిందని శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మాపూర్ లో శిక్షణ గ్రూప్ వన్ అధికారులు రైతు వేదిక తదితర అంశాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలలో శిక్షణ ఐఏఎస్,ఐపీఎస్ అధికారులు పర్యటించడం వల్ల పలు అంశాలను తెలుసుకోవడం జరిగిందని నూతన గ్రామ సర్పంచులు తెలిపారు. లాల్ కోట, అమ్మాపూర్ గ్రామాలలో శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బృందం పర్యటించారు. మీరు వెంట తహసిల్దార్ ఎల్లన్న, ఎంపీడీవో లక్ష్మీ ం నరసింహులు, సర్పంచులు గోపాల్, రంజిత్ ,ఉపసర్పంచ్లు బోయ రవి ,పంచాయతీ కార్యదర్శి రాజు, విష్ణు, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శిక్షణ అధికారుల బృందం

## ఏఐఎస్ఎఫ్ మహాసభలకు వెళ్ళిన గద్వాల విద్యార్థి సంఘ నాయకులు

**గద్వాల ఫిబ్రవరి 18, ప్రభాత వార్త:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఏ ఐ ఎస్ ఎఫ్) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు నేటి నుండి తేది 18,19,20 జరుగుతున్న సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా నుండి ఏ ఐ ఎస్ ఎఫ్ నాయకులు విద్యార్థులు మహాసభలకు వెళ్లి పాల్గొనడం జరిగిందని జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా లో మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభల లో మొదటి రోజు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించడం జరిగిందని, అలాగే ఈ మహాసభలు రాష్ట్రం లో ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మహాసభలలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి, దేశానికి స్వాతంత్రం తేవడంలో ఏ ఐ ఎస్ ఎఫ్ ముఖ్యపాత్ర పోషించిందని తెలిపారు.అలగే విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఐక్యం కావాలని జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ పిలుపునిచారన్నారు. మొదటిరోజు జరిగిన మహాసభలకు పాల్గొని విజయవంతం చేయడం జరిగిందనీ వారు తెలిపారు.





ర్యాలీ చేస్తున్న ఏ ఐ ఎస్ ఎఫ్ నాయకులు, విద్యార్థులు ( ఇన్‌సెట్లో ) మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనమ్నేని సాంబశివ రావు

## నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** డీయుజీ కే వై, ఈజీఎంఎం, బిఎస్ఎన్ శిక్షా సమితి ప్రైవేట్ లిమిటెడ్ (స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం) ద్వారా నిరుద్యోగ యువతులకు 3 నెలల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమం మహబూబ్ నగర్ లోని శెట్టి కాంప్లెక్స్, రాజేంద్ర నగర్ నందు ప్రారంభించబడినది. అవకాశాన్ని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులు సద్వినియోగం చేసుకోగలరు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్ అసిస్టెంట్ కోర్స్) 10 వ తరగతి ఆపై చదివిన యువతుల నుండి దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయి. ఈ శిక్షణ కాలంలోఉచిత భోజనంతో కూడిన వసతి,ఉచిత యూనిఫామ్.ఉచిత కోర్స్ మెటీరియల్, నర్సింగ్ అసిస్టెంట్ సర్టిఫికెట్ ఇవ్వడం జరగుతుంది. శిక్షణ అనంతరం ప్రముఖ కార్పోరేట్ ఆసుపత్రులలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించబడును.మరిన్ని వివరాలకు : 9949698592, 8328574600 నెంబర్ లలో సంప్రదించవచ్చునని ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ రవి కుమార్ తెలిపారు.

## మహిళాభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి




మున్సిపల్ చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**వనపర్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** వనపర్తిలో మహిళాభివృద్ధికి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిపిఐ అనుబంధ భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా నేతలు వనపర్తి నూతన మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్ ను కోరారు. చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా వనపర్తి స్వగృహంలో కలిసి మాధవి దంపతులను శాలువాతో సత్కరించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీలో మహిళల కోసం ప్రత్యేకంగా పథకాలు రూపొందించి అభివృద్ధికి కృషి చేయాలని, మహిళలు, బాలికల భద్రత రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కేతేపల్లి మాజీ సర్పంచ్ భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, జిల్లా అధ్యక్షురాలు, కేతేపల్లి ఉపసర్పంచ్ కృష్ణవేణి, పట్టణ కన్వీనర్ జయమ్మ తదితరులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి దంపతులను శాలువాతో సన్మానించారు. పట్టణకో కన్వీనర్ శిరీష, నేతలు రూప, జ్యోతి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## పెబ్బేరు వనపర్తి మున్సిపల్ చైర్మన్‌లను, వైస్ చైర్మన్‌లకు ఘన సన్మానం



చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ చైర్మన్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన అక్కి శ్రీనివాస్ గౌడ్‌ను, వనపర్తి చైర్మన్ ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ ను కలిసి వారికి అభినందనలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి చర్ల శ్రీహరి, వార్డు సభ్యులు నవీద్, శేఖర్,భాస్కర్, శ్రీరంగాపూర్ గ్రామ అధ్యక్షులు గోవిందు, రామచంద్రయ్య, టైలర్ అంజి,విష్ణు, రమేష్,కృలయ్య, మహేష్, అంజి,అబ్దుల్ సమీర్, వెంకటేశు నాయక్, డైరెక్టర్ చంద్ర శేఖర్, సంపత్,నాగరాల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

**దామరగిద్ద, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలో నేడు చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు శివాజీ విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు కావలి వెంకటప్ప తెలిపారు.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు హాజరుకానున్నారని చెప్పారు. యువకులు, మహిళలు, పెద్దలు సహా ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. విగ్రహావిష్కరణ అనంతరం పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## నూతనంగా గెలుపొందిన ముదిరాజ్ పురపాలక సభ్యులకు ఘన సన్మానం



నూతనంగా గెలుపొందిన ముదిరాజ్ పురపాలక సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** తెలంగాణ ముదిరాజ్ మహాసభ నారాయణపేట జిల్లా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా గెలుపొందిన ముదిరాజ్ పురపాలక సభ్యులకు ఘన సన్మానం నిర్వహించారు. నారాయణపేట, మద్దూర్ మున్సిపల్ కౌన్సిల్ పరిధిలో ఇటీవల కౌన్సిలర్లుగా ఎన్నికైన ముదిరాజ్ సోదరులను ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పటేల్ శ్రీనివాస్ ముదిరాజ్, జిల్లా యువత అధ్యక్షుడు దామరగిద్ద చందు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. పేట పురపాలక సభ్యులుగా ఎన్నికైన నారాయణమ్మ భీమయ్య ముదిరాజ్, అప్పిరెడ్డి పల్లి రాములు , భాగ్యవతి మల్లేష్ లను, అలాగే మద్దూర్ పురపాలక సభ్యులుగా ఎన్నికైన గడ్డమిది గోవిందు , ముంకన్పల్లి నర్సిములు శ్యామలప్పలను శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్ జాతి అభివృద్ధికి ఎన్నికైన ప్రతినిధులు కృషి చేయాలని, వారిని గెలిపించిన వార్డు ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలని సూచించారు. ఎన్నికైన సభ్యులు కూడా ముదిరాజ్ సంఘం అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తామని, దూర ప్రాంతాల నుంచి వచ్చి సన్మానం చేయడం తమకు ఆనందంగా ఉందని తెలిపారు.

## బీసీల ఆత్మభిమానాన్ని తాకట్టు పెట్టింది నువ్వు కాదా?

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలో నువ్వు చేసింది ఏమి లేదని అన్నారు. ఖబర్దార్ చందర్, సాగర సంగం రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ బేషరతుగా ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో బీసీ సమాజమంతా ఏకమై ఉద్యమిస్తామన్నారు. అనంతరం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ తల్లిపాలు తాగి తల్లి రొమ్మును గుద్దినట్లు ఉంది విజయ్ చందర్ తీరు అని ఆయన ఎద్దేవా చేశారు. నమ్మి పార్టీ టికెట్ ఇస్తే డబ్బుల కోసం టిడిపి పార్టీకి ఓటేసిన నీచమైన చరిత్ర నీది కాదా అన్నారు. ఆ ఒక్కడి వల్ల మున్సిపల్ చైర్మన్ పీఠందూరమైందని గతాన్ని గుర్తు చేశారు. నీ అనుచరుడైన ఏవన్ కాంట్రాక్టర్ తిరుపతయ్య సాగర్ గత హాయంలో బిల్లులు రాకపోతే..బీసీ బిడ్డకు అన్యాయం జరుగుతుందని పెండింగ్ ఉన్న బిల్లులను ఇప్పించింది ఎమ్మెల్యే మేఘారెడ్డి కదాఅన్నారు. విజయ్ చందర్‌కి ఎప్పుడైనా మున్సిపల్ చైర్మన్ పీఠం అని ఎమ్మెల్యే మేఘా రెడ్డి గానీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి గానీ ఇస్తామన్న మాటను దేవుడు పై ప్రమాణం చేసి నిరూపిస్తే రాజీనామాలకు వెనకాడమన్నారు.ఈ విలేకరుల సమావేశంలో మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ,మహేష్, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారి,చీర్లజనార్ధన్, సత్యం సాగర్, కౌన్సిలర్లు మహేశ్వరి, విజయలక్ష్మి ్మ, పరశురాం, శరవంద, మాజీ సింగిల్ విండో సభ్యులు సహదేవ్ యాదవ్ , మైనార్టీ నాయకులు రఫీ, సత్య శిలారెడ్డి, కిచ్చారెడ్డి, కదిరే రాములు, నందిపేట తిరుపతయ్య, పలువురు ఉన్నారు.

## ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

17. డీజేలు లేదా నిషేధిత శబ్దపరికరాలు ఉపయోగించినట్లయితే కేసులు నమోదుచేసిచట్టపరమైన చర్యలుతీసుకోబడతాయి.18. చట్టవ్యతిరేక చర్యలు,శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకోబడతాయి.19.పోలీసుల ఆదేశాలను పాటించని నిర్వాహకులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయబడతాయి.శాంతియుత వాతావరణం కాపాడేందుకు నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలి.జిల్లా ఎస్పినిర్వాహకులు నిబంధనలు పాటించి శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని హెచ్చరించారు.



ముస్తాబైన కౌకుంట్ల జామియా మసీద్

## కనిపించిన నెలవంక.. రంజాన్ నెల ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఉపవాస దీక్షలను చేపడతారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు కనీసం నీరు కూడా తాగరు. సరికదా నోట్లోని లాలాజలాన్ని కూడా మింగరూ.అత్యంత కఠినంగా ఉపవాస దీక్షను చేస్తారు. అల్లాను ప్రార్థిస్తారు.

**నమాజ్ చేసే సమయం :** రంజాన్ ఉపవాసం చేస్తూనే రోజుల్లో సూర్యో దయం నుంచి సూర్యాస్తమయం వరకురోజులో ఐదు సార్లు నమాజ్ చేస్తారు. రాత్రి 8:30 నుంచి రాత్రి 10 గంటల మధ్య సమయంలో అంటే సహర్ నుంచి ఇఫ్తార్ సమయం వరకు రోజుల్లో ఐదుసార్లు నమాజ్ చేస్తారు.



రాత్రి తరావిహీ నమాజ్ చదివిన అనంతరం ముస్లిం సోదరులు

తరావిహీ నమాజ్‌లో రెండుసార్లు కురాన్ చదువుతారు. ఈ నెల రోజుల్లో నఫీల్ చదివితే,ఫరజ్ చదివినంత పుణ్యమని ఇస్లాంగ్రంథాల్లోఉంది. రంజాన్ మాసం ముగిసిన తర్వాత ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్ జరుపుకుంటారు.

## శ్రీరంగాపూర్ జూనియర్ కాలేజీలో వీడ్కోలు సమావేశం




వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోజెస్ అధ్యక్షత వహిస్తూ25/02/2026 బుధవారం నుంచి జరిగే వార్షిక పరీక్షలను ప్రణాళికను ఏర్పాటు చేసుకొని అత్యధిక మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని, పరీక్ష సమయంలో పాటించవలసిన మెళకువలను, సూచనలను విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. తెలుగు అధ్యాపకులు పి.గోపాల్ ప్రీ ఫైనల్ ఎగ్జామ్ లో 60 మార్కులకు పైగా మార్కులు సాధించిన విద్యార్థిని,విద్యార్థులకు పెన్నులను బహుమతిగాఇచ్చి వారిని ప్రోత్సహించారు. ఫిజిక్స్ లెక్చరర్ సి.వెంకట కృష్ణ ప్రథమ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు ప్యాడ్, పెన్నులను బహుమతిగా ఇచ్చి ప్రోత్సహించారు. విద్యార్థిని, విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి కళాశాలలో సంవత్సరం మొత్తం మధ్యాహ్న భోజన కార్యక్రమంలో ప్రముఖ పాత్ర వహించిన వెంకటన్న, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు,ల్యాబ్ అటెండ్ సాజీదులను ప్రిన్సిపాల్ అధ్యాపకులు ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోజెస్,కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిటి మృతి పట్ల గిరిజన నేతలు సంతాపం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 18ప్రభాతవార్త:** ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డిటి పరుశ్ నాయక్ మృతి పట్ల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు సభావట్ బిచ్చ నాయక్, గిరిజన నాయకులు, గిరిజన సర్పంచులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృదుస్వభావి, స్నేహశీలి, అందరితో కలుపుగోలుగా ఉంటూ సేవలందిస్తూ అందరికీ మమేకమై ఉండేవారని ఆకస్మికంగా మృతి చెందడం అందర్నీ కలిచి వేసిందన్నారు.ఉప తహసీల్దార్ మృతి పట్ల గిరిజన నేతలు పలువురు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ అయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

## రంజాన్ ప్రార్థనలు ఫలించాలి

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ నెల ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదరులకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలతో మీరు చేసే ప్రార్థనలు ఫలించాలి అన్నారు. ఆ అల్లా దయతో అందరికీ మంచి జరగాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆకాంక్షించారు.

# సంత్ సేవాలాల్‌కు ఘన నివాళి

**■ సమాజ శ్రేయస్సుకు కృషి చేసిన సద్గురు సంత్ సేవాలాల్ ■ దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్**

**భూత్పూర్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** బంజారా జాతి ఔనత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ అని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) అన్నారు.సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ హితం కోసం,సమాజ శ్రేయస్సు కోసం ఆహర్నిశలు కృషిచేశారని పేర్కొన్నారు. భూత్పూర్ మండలం పెద్దతండాలో బుధవారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ప్రభుత్వ పరంగా నిర్వహించిన ఈ ఉత్సవాలకు మండలంలోని పలు తండాలు,గ్రామాల గిరిజనులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ సేవాలాల్ మమారాజ్ మహనీయుడని,సమాజానికి సేవాలాల్ ఇచ్చిన సందేశాలు, ఆయనఆదర్శాలను ప్రతివ్యక్తి ఆచరణలో పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ ముడావత్ బాలకోటి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మూడో వార్డు కౌన్సిలర్ పాల్యావత్ లాల్య,ఐదోవార్డు కౌన్సిలర్ కెంద్యాల పద్మ, భుటు ్టపల్లి ఏవీఆర్ కాలనీ సర్పంచి తారు నాయక్,ఉప సర్పంచి సభావత్ జైపాల్ నాయక్,హరియా నాయక్, శంకర్ నాయక్‌లతో పాటుపలువురుకాంగ్రెస్ నాయకులు ,పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.





## సేవాలాల్ జయంతి వేడుకలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

**భూత్పూర్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు భూత్పూర్ మండలం పెద్దతండాలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలో భూత్పూర్ మున్సిపాలిటీ నాల్గోవార్డు కౌన్సిలర్ గద్దం ప్రేమ్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు టిఎంగౌడ్, సత్తూర్‌నారాయణగౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

# తూతూ మంత్రంగా పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం

**ప్రహరీకి సక్రమంగా ప్లాస్టింగ్ చేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్**

**రాజాపూర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల పరిధిలోని చొక్కంపేట గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలకు నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడను సంబంధిత కాంట్రాక్టర్ తూ తూ మంత్రంగా నిర్మించాడని, ప్రహరీ గోడకు సక్రమంగా ప్లాస్టింగ్ చేయలేదని, బేస్మెంటు కూడా సక్రమంగా తీయకుండానే ప్రహరీని నిర్మించి చేతులు దులుపుకున్నారని, ప్రహరీ గోడను సక్రమంగా నిర్మించని గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని చొక్కంపేట గ్రామ సర్పంచ్ కావలి అలివేలు భర్త ఆంజనేయులు, గ్రామ ఉపసర్పంచ్ మంచాల రాజు, వార్డు సభ్యులు మంచాల నరసింహ, గ్రామ నాయకులు ఆవులమంద వెంకటేష్ తదితరులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి దాదాపు 22 లక్షల ముధా నిధులతో ప్రహరీ గోడను మంజూరు చేయడం జరిగిందని ప్రహరీ గోడ నిర్మాణ సమయంలో గోడకు నీటిని కూడా సక్రమంగా కొట్టలేదని, ప్రహరీ గోడ పై భాగాన్ని సరి చేయకుండానే పెయింట్ వేశారని ఆరోపించారు. ప్రహరీ గోడకు బేస్మెంటు కూడా సరిగ్గా తీయకుండానే పనులు పూర్తి చేశారని వారు పేర్కొన్నారు. ఈ విషయమై అధికారులు స్పందించకుంటే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా వారన్నారు.



ప్రహరీ గోడను చూపుతున్న గ్రామస్తులు

**సంబంధిత అధికారి వివరణ :** ఈ విషయమై ఏఈ కృష్ణను వివరణ కోరగా ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం ఎస్టిమేంట్ లో ఉన్న దానికంటే దాదాపు 30 మీటర్ల మేర ప్రహరీ ఎక్కువ కావడం జరిగిందని, దానివల్ల ఒకటేసారి ప్లాస్టింగ్ చేసి మంజూరైన నిధులను అడ్జెస్ట్ చేసినట్లు ఏఈ కృష్ణ తెలిపారు.

# సామూహిక ప్లాస్టిక్ ఏరివేత

### ప్రయాణికులకు పరిశుభ్రతపై అవగాహన

**జడ్చర్ల, ఫిబ్రవరి18 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో డా. బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల జడ్చర్ల సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్ జాతీయ సేవా పథకం యూనిట్స్ సంయుక్తంగా సామూహిక ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమాన్ని జడ్చర్ల బస్టాండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. సంజయ్, అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్, హైదరాబాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ యువజన శాఖ ఆధ్వర్యంలో దేశం నలుమూలలా ఇలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలుపుతూ ఇది అందరికీ అవసరమైన కార్యక్రమము అని పేర్కొన్నారు. ముఖ్యంగా బస్టాండ్ పరిసరాలను వాలంటీర్లు స్వచ్ఛందంగా పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను సేకరించారు. ప్రయాణికులకు పరిశుభ్రతపైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డా. ప్రవీణ,జడ్చర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ దోరేపల్లి లక్ష్మీరవీందర్, కళాశాల ప్రిన్సిపల్ డా.జి . సుకన్య, వైస్ ప్రిన్సిపాల్ డా.నర్మద, ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాసులు, డా.సదాశివయ్య, వేణు, పుష్పలత, 150 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.



సామూహిక ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

# రాజాపూర్ మండల బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కమిటీ ఎన్నిక

### మండల అధ్యక్షులుగా జెనిగల శేఖర్

**రాజాపూర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాజపూర్ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు బీసీ,ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్రకార్యదర్శి బాలయ్య ముదిరాజ్ తెలిపారు. మండల అధ్యక్షునిగా జెనిగల శేఖర్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా రామని రాఘవేందర్, మొగిలి ప్రవీణ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు, కార్యదర్శిగా కావలి రంజిత్ కుమార్, బాలన్ జన్ ముదిరాజ్, కోశాధికారిగా జటావత్ వాల్య నాయక్, సలహాదారులుగా అల్లే మధు, ఇతర కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నట్లుబాలయ్య ముదిరాజ్ తెలిపారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ బీసీ,ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి, హాజరైన విద్యార్థులు

# పియులో ప్లేస్మెంట్ డ్రైవ్

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి18 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం ఫార్మసీ ఆడిటోరియంలో ఫార్మసీ (33) ఎంబీఏ, ఎంకాం (45) విద్యార్థుల కోసం అమ్నీల్ ఆంకాలజీ, హైదరాబాద్, జడ్చర్ల క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ డి. మధుసూదన్ రెడ్డి, ఫార్మసీ కాలేజ్ డా. సిహెచ్. రవికాంత్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వారు ఆర్‌టెక్ సొల్యూషన్స్, అమ్నీల్ ఫార్మా, ఆర్ కిషోర్ కుమార్ ఏజిఎం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ ప్రొడక్షన్ మేనేజర్ సంజయ్ ఎం ఇంటర్వ్యూ ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. ఎస్.ఎన్.అర్జున్ కుమార్, కె. ప్రణతి, సౌమ్య శేఖర్, ఎండి. సిరాజుద్దీన్ టాస్క్ కోఆర్డినేటర్, అమ్నీల్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినందుకు పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥జి. ఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొ॥ పి. రమేష్ బాబు, ఆర్‌టెక్ సొల్యూషన్స్ అమ్నీల్ ఫార్మా జడ్చర్లలను అభినందించారు. ఈ ఇంటర్వ్యూకి ఫార్మసీ ఎంబీఏ, ఎమ్ కామ్ కు సంబందించిన 78 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లేస్మెంట్ పొందిన విద్యార్థులు

## గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేస్తా

### మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత నర్సిములు

**జడ్చర్ల,ఫిబ్రవరి18 ప్రభాతవార్త:** గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. బాదేపల్లి గ్రంథాలయ శాఖ పాలకమండలి సభ్యులు చైర్ పర్సన్ కోనేటి పుష్పలతను ఆహ్వానించి గ్రంథాలయభవనానికి సంబంధించి పలు పనులు కావాలని కోరారు. త్వరలోనే సంబంధిత పనులు చేయిస్తానని, గ్రంథాలయం అభివృద్ధికొరకు ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి సహకారంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలోగ్రంథాలయ పాలకమండలి సభ్యులు, లక్ష్మీ పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత నర్సిములుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం



## ఎమ్మెల్యే జీఎంఆర్‌చే చెక్కుల పంపిణీ

**భూత్పూర్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ప్రొసీడింగ్స్, షాదీముబారక్,కల్యాణలక్ష్మి చెక్కులనుదేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.37మందికి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు,13మంది కల్యాణలక్ష్మి,షాదీముబారక్ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులు,ప్రొసీడింగ్స్‌ను ఎమ్మెల్యే జీఎంఆర్ అబ్ధిదారులకుఅందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ ముడావత్ బాలకోటి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో పాటు భూత్పూర్‌తహసిల్దార్ కిషన్‌నాయక్,ఎంపీడీఓఉమాదేవితో పాటు కౌన్సిలర్లులాల్య,కెంద్యాలపద్మ,పలు గ్రామాల సర్పంచులు మాసగౌడ్(కప్పెట) ,ఆనంద్‌రెడ్డి(పోతులమడుగు),మలిశెట్టివెంకటేష్(కొత్తమొల్గర),రమేష(వెల్కిచర్ల), కాంగ్రెస్ నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌని అమరేశ్వర్ రెడ్డి

**దేవరకద్ర, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌని అమరేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా నెలరోజుల పాటు నియమ నిష్టలతో కఠిన ఉపవాసాల దీక్షలతో, మీరు చేసే ప్రార్థనలు ఫలించాలని, రంజాన్ ఉపవాస పవిత్ర దినాలు ప్రారంభమైన సందర్భంగా ముస్లిం సోదరులకు ఆ అల్లా దయతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

## మెరుగైన వసతులు

### టీపీసీసీ కార్యదర్శి ఎస్ఎ వినోద్ కుమార్



కళాశాలను సందర్శించిన టీపీసీసీ కార్యదర్శి ఎస్ఎ వినోద్ కుమార్

**మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి18 ప్రభాతవార్త:** జీసీ ట్రెజరర్ టైటస్ రాజేందర్ పిలుపు మేరకు మహబూబ్‌నగర్ లోని ఎంబీసీ జూనియర్ కళాశాలను టీపీసీసీ కార్యదర్శి వినోద్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంబీసీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిమోతి కళాశాల స్థితి గతులను గురించి వివరించారు. గతానికి భిన్నంగా కళాశాల రూపురేఖలు మారాయన్నారు. పునర్వైభవంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభిస్తున్న కాలేజీకి సంబంధించి ఇంకా చాలా అవసరాలు ఉన్నాయని వీలైన మట్టుకు కాలేజ్ అభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని, ఎమ్మెల్యే ప్రత్యేక నిధుల నుండి కాలేజ్ అభివృద్ధి కోసం మంజూరు చేయించే ప్రయత్నం చేయాలని కోరారు. వారితో పాటు చిన్న రాజు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ముదిరాజ్ లకు పెద్దపీట

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షేరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**జడ్చర్ల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజ్ సామజిక వర్గానికి పెద్ద పీట వేస్తున్నారని జడ్చర్ల మున్సిపల్ చైర్పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. జడ్చర్లలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షేరాభిషేకం నిర్వహించారు. సర్పంచ్ ఎన్నికల్లో అత్యధికంగా ముదిరాజ్ లే గెలిచారని, నిన్న మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇద్దరు మేయర్లుగా దాదాపు 10నుండి 15మున్సిపల్ చైర్మనులుగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. రేపు రాబోయే ఎంపిటీసీ,జడ్పిటిసి ఎలక్షన్లలో కూడా మనవాళ్ళు ఎక్కువ మొత్తంలో నిలబడి గెలవాలని చైర్పర్సన్ కోనేటి పుష్పలత కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేణుక, మాజీ ఎంపిటిసిలక్ష ్మమ్మ, అనుప కృష్ణయ్య, మార్కెట్ డైరెక్టర్ లక్ష్మణ్, పట్టణ ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడులు

**దామరగిద్ద, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** దామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యావారిపల్లి గ్రామ శివారులో డబ్బులు పందెంగా పెట్టుకు ని పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్, దామరగిద్ద పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మైబు, లాలప్ప, గోవిందు, వెంకట్ నాయక్ అనే నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 9,500 నగదు, నాలుగు సెల్‌ఫో న్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు దామరగిద్ద ఎస్సై రాజు తెలిపారు.



పేకాట స్థావరంపై దాడులు చేసి నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

## ఓటర్ జాబితా తప్పు ఒప్పులను సవరించాలి

**ప్రతి ఇల్లు తిరిగి 100 శాతం ఓటర్ జాబితాను సిద్ధం చేయాలి**

**మహబూబ్‌నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**బాలానగర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ సందర్శించారు. కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని 37 గ్రామ పంచాయతీలలో ఓటర్ జాబితా తప్పు ఒప్పులను సవరించాలన్నారు. మండల అధికారులు గ్రామాలలో బిఎల్ఓలు అధికారులు కలిసి గ్రామంలోని ప్రతి ఇల్లు తిరిగి, 100 శాతం ఓటర్ జాబితాను సిద్ధం చేయాలన్నారు. మండలంలోని రేషన్ కార్డు దారులు, వారి కుటుంబ సభ్యులలో ఈకేవైసీ పూర్తికాని వారిని, సమీపంలోని రేషన్ షాప్ లో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకునేలా రేషన్‌డీలర్లకు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ లిఖితారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.